క్లుప్తంగా

బియ్యం, నిత్యావసర సరుకులు పంపిణీ



తాతకుంట్ల(విస్సన్నపేట): మండలంలోని తాతకుంట్ల పంచాయతీ పేరాబత్తుల ఎస్సీ వాడలో వితంతువులకు, దివ్యాంగులకు, పేదలకు కేశినేని శ్రీదేవి మెమోరియల్ చారిటబుల్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో బియ్యం, నిత్యావసర సరుకులు ఆదివారం అందజేశారు. ఫౌండేషన్ ఆధ్వర్యంలో ప్రతి నెలా గ్రామంలో వితంతువులకు, దివ్యాంగులకు, పేదలకు బియ్యం, నిత్యావసర సరుకులు అందజేస్తున్నామని ఫౌండేషన్ చైర్మన్ కేశినేని రమేష్ తెలిపారు.

ఉపాధ్యాయుడికి ఉద్యోగ విరమణ సన్మానం



విస్సన్నపేట: గత 30 ఏళ్లుగా ఉపాధ్యాయ వృత్తిలో అంకితభావంతో విధులు నిర్వర్తించి ఎందరో విద్యార్థులను ఉన్నతులుగా తీర్చిదిద్దిన వీర్ల కిశోర్ కుమార్ అభినందనీయుడని జెడ్పీ మాజీ చైర్పర్సన్ నల్లగట్ల సుధారాణి అన్నారు. స్థానిక జిల్లా పరిషత్ హైస్కూల్‌లో బయోలాజికల్ సైన్స్ ఉపాధ్యాయుడిగా విధులు నిర్వర్తిస్తూ పదవీ విరమణ చేస్తున్న వీర్ల కిశోర్‌కుమార్ సన్మాన కార్యక్రమం ఆదివారం నిర్వహించారు. కిశోర్‌కుమార్ దంపతులను మాజీ ఎమ్మెల్యే నల్లగట్ల స్వామిదాసు, సుధారాణి సన్మానించారు. ఎంపీపీ పిల్లి మెర్సీవ నజాక్షి, రాజేష్ దంపతులు, ఎంపీడీఓ చేకు చిన్నరాట్నాలు, పాఠశాల హెచ్‌ఎం శోభారాణి, విశ్రాంత తెలుగు లెక్చరర్ ముంగా జయరాజు, ఉపాధ్యాయ సంఘం నాయకులు, వివిధ పాఠశాలల ప్రధానోపాధ్యాయులు, విశ్రాంత ఉపాధ్యాయులు, పాఠశాల సిబ్బంది పాల్గొన్నారు.

అఖండ నామ సంకీర్తన ప్రారంభం

తిరువూరు: స్థానిక శ్రీ సత్యసాయి సేవా సమితిలో సత్య సాయిబాబా 100వ జన్మదినం సందర్భంగా ఆదివారం సాయంత్రం అఖండ నామ సంకీర్తన ప్రారంభించారు. వంద గంటల పాటు సాయినామ సంకీర్తన జరుగుతుందని సమితి కన్వీనర్ దామెర ప్రభాకరరావు తెలిపారు. జూలై 3వ తేదీ వరకు ఈ కార్యక్రమం జరుగుతుందన్నారు.

సూపర్ సిక్స్ హామీలు అమలు చేయాలి: సీపీఐ

విస్సన్నపేట: ఎన్నికల ముందు ప్రకటించిన సూపర్ సిక్స్ హామీలను కూటమి ప్రభుత్వం అమలు చేయాలని సీపీఐ నియోజకవర్గ కార్యదర్శి షేక్ నాగుల్‌మీరా డిమాండ్ చేశారు. స్థానిక సీపీఐ కార్యాలయం వద్ద సీపీఐ మండల సమావేశం ఆదివారం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ మహిళలకు నెలకు రూ.1500 ఇవ్వాలని, ఫీజు రీయింబర్స్‌మెంట్ విడుదల చేయాలని, మహిళలకు ఉచిత బస్సు అమలు చేయాలని, స్మార్ట్ మీటర్ల విధానాన్ని వెంటనే రద్దు చేయాలని కోరారు. సమావేశంలో సీపీఐ మండల కార్యదర్శి మర్సకట్ల త్యాగరాజు, సీనియర్ నాయకుడు వేగి వెంకటేశ్వరరావు, రాజేష్ పాల్గొన్నారు.

ఎన్నేళ్లీ ఇబ్బందులు!

- చిన్నపాటి వర్షానికే గ్రామాలకు రాకపోకలు బంద్
- కవులూరు శివారులో లో లెవెల్ చప్టాతో ప్రజలకు కష్టాలు
- బుడమేరు కాలువపై వంతెన నిర్మాణం కోసం ఎదురుచూపులు
- వర్షాకాలం కావడంతో ప్రజల ఆందోళన



కవులూరు శివారులో బుడమేరుపై ఉన్న లో లెవెల్ చప్టా

జి.కొండూరు: కవులూరు శివారులో బుడమేరు వాగుపై ఉన్న లో లెవెల్ చప్టాతో స్థానికులు నరకయాతన పడుతున్నారు. బుడమేరు హెడ్ రెగ్యులేటర్‌కు దిగువన కవులూరు గ్రామ శివారులో బుడమేరుపై దశాబ్దాల కిందట నిర్మించిన లో లెవెల్ చప్టా నిత్యం వరదలతో మంపునకు గురై రాకపోకలకు తీవ్ర అంతరాయం కలుగుతోంది. చప్టా వద్ద వాగు ఆక్రమణలకు గురై వెడల్పు తగ్గిపోవడంతో కొద్దిపాటి వర్షం కురిసినా చప్టాపై మూడు నుంచి ఐదు అడుగుల మేరు నీటి ప్రవాహం కొనసాగుతుండడంతో రాకపోకలు నిలిచిపోతున్నాయి. ఇక వర్షాకాలంలో తుపానులు వచ్చినప్పుడైతే బుడమేరుకు వరద ప్రవాహం పెరిగి రోజుల తరబడి చప్టాపై వరదనీరు ప్రవహించడంతో రాకపోకలు నిలిచిపోయి సమీప గ్రామాలైన వెలగలేరు, రాయనపాడు, పైడూరుపాడు గ్రామాలతో కవులూరు గ్రామానికి బంధం తెగిపోతుంది.

ప్రధాన రహదారి ఇదే

కవులూరు గ్రామానికి చెందిన ప్రజలు విజయవాడ వైపు వెళ్లాలంటే ఇదే ప్రధాన రహదారిగా ఉంది. రాయనపాడు, పైడూరుపాడు, కొత్తూరు తాడేపల్లి, వెలగలేరు గ్రామాలకు చెందిన పలువురు కొండపల్లి ఐడీఏలోని పలు పరిశ్రమల్లో పని చేసేందుకు రాకపోకలు సాగించేందుకు ఇదే ప్రధాన రహదారిగా ఉంది. విజయవాడ వైపు పాఠశాలలకు, ఉద్యోగాలకు వెళ్లే వారికి కూడా ఇదే ప్రధాన రహదారిగా ఉంది. ఈ చప్టాపై నిత్యం వరద నీరు ప్రవహించడంతో రాకపోకలు నిలిచిపోయి స్థానికులు నరకయాతన పడుతున్నారు.

గత వరదల్లో నరకయాతన

గత ఏడాది ఆగస్టులో బుడమేరుకు వచ్చిన వరదలతో ఈ చప్టాపై రోజుల తరబడి వరద ప్రవహించడంతో పైడూరుపాడు, రాయనపాడు, కవులూరు గ్రామాలకు రాకపోకలు నిలిచిపోయాయి. పైడూరుపాడు గ్రామ ప్రజలకు వరద సాయం అందించేందుకు కానీ, తాగునీరు అందించేందుకు కానీ వీలులేకపోవడంతో నరకయాతన పడ్డారు. ఆ సమయంలో పడవల ద్వారా మాత్రమే ఆహారం, తాగునీటి సరఫరా జరిగింది. అదే ఈ చప్టా వద్ద హైలెవెల్ వంతెన ఉంటే గత వరదల్లో స్థానికులకు సత్వరమే వరద సాయం అందించేందుకు వీలు కలిగేది.



చప్టా వద్ద గడ్డితో అల్లుకుపోయి ఇరుకుగా ఉన్న బుడమేరు వాగు

ఇరుకుగా ఉన్న వాగు

హెడ్ రెగ్యులేటర్ నుంచి దిగువన ఉన్న బుడమేరు అంతా ఆక్రమణలకు గురై ఇరుకుగా మారింది. ఈ క్రమంలో కవులూరు శివారులోని చప్టా వద్ద వాగు మలుపు ఉండటంతో పాటు వాగు ఇరుకుగా ఉండడం, వాగులో పూడిక తీయకపోవడంతో తూడుకాడ, జమ్మి వంటి గడ్డి జాతి మొక్కలు పెరిగి వరద ప్రవాహం ముందుకు సాగే అవకాశం లేక కొద్దిపాటి వర్షానికే వరదనీరు పోటువేసి రాకపోకలకు అంతరాయం కలుగుతోంది.

హై లెవెల్ వంతెన నిర్మించాలి



మా గ్రామ శివారులో బుడమేరు వాగుపై ఉన్న లో లెవెల్ చప్టా వల్ల ప్రయోజనం లేదు. కొద్దిపాటి వర్షం వచ్చినా చప్టాపై మనిషిలోతు నీరు ప్రవహించి రాకపోకలు నిలిచిపోతున్నాయి. వర్షాకాలంలో వరదంతా బుడమేరులోనే ప్రవహిస్తూ ఉంటుంది కాబట్టి హై లెవెల్ వంతెనను నిర్మిస్తే మాకు కష్టాలు తప్పుతాయి.

– గుణదల వెంకటేశ్వరరావు, గ్రామస్తుడు, కవులూరు

వర్షం పడితే నరకయాతన



కొద్దిపాటి వర్షం పడినా బుడమేరు చప్టాపై వరద నీరు ప్రవహించి వాగు దాటేందుకు వీలు ఉండడం లేదు. వర్షా కాలంలో మా పొలాలకు వెళ్లాలన్నా, విజయవాడ వైపు వెళ్లాలన్నా నరకయాతన పడుతున్నాం. పాఠశాలలకు వెళ్లే పిల్లలు, ఉద్యోగస్తులు ఇబ్బంది పడుతున్నారు. వెంటనే హై లెవెల్ వంతెన నిర్మించాలి.

– గరిమెళ్ల సురేష్, గ్రామస్తుడు, కవులూరు

హెచ్‌ఎం గోపాల్ సేవలు ప్రశంసనీయం



మైలవరం: ప్రధానోపాధ్యాయుడు పి. గోపాల్ సేవలు ప్రశంసనీయమని ఎంఈఓ ఎల్. బాలు అన్నారు. మైలవరం మండలం ఎల్‌ఎఫ్‌ఎల్ ప్రధానోపాధ్యాయుడు గోపాల్ ఉద్యోగ విరమణ కార్యక్రమం మైలవరం డాక్టర్ ఎల్ హెచ్ రెడ్డి ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో ఆదివారం జరిగింది. ఆయనను ఘనంగా సన్మానించి ఆయన సేవలను కొనియాడారు. కొండపల్లి మున్సిపల్ చైర్మన్ సీహెచ్ చిట్టిబాబు, పీఆర్‌టీయూ రాష్ట్ర నాయకుడు గద్దం నారాయణరావు, చంద్రాల సర్పంచ్ జొన్నలగడ్డ జ్యోతి గంగాధరరావు, కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ ఇళ్ల రవి తదితరులు పాల్గొన్నారు.

ప్రజా సమస్యలను అధికారుల దృష్టికి తీసుకువెళ్లండి

మాజీ మంత్రి జోగి రమేష్ పిలుపు



నర్రా విజయ్‌ను సత్కరించిన జోగి రమేష్ తదితరులు

ఇబ్రహీంపట్నం: పార్టీ పదవుల్లో నూతనంగా నియమితులైన వారు నిత్యం ప్రజల మధ్య ఉంటూ ప్రజా సమస్యలు తెలుసుకుని అధికారుల దృష్టికి తీసుకు వెళ్లాలని మాజీ మంత్రి, వైఎస్సార్ సీపీ మైలవరం నియోజకవర్గ సమన్వయకర్త జోగి రమేష్ అన్నారు. వైఎస్సార్ సీపీ మండల ఉపాధ్యక్షుడిగా నియమితులైన నర్రా విజయ్, జూపూడి గ్రామ పార్టీ అధ్యక్షుడు బాదావత్ సీతయ్య, ఉపాధ్యక్షుడు కలతోటి కామేశ్వరరావు, స్థానిక నాయకులు జోగి రమేష్‌ను ఆదివారం మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా జోగి రమేష్ వారిని శాలువాతో సత్కరించి అభినందించారు. మండల, గ్రామ స్థాయిలో వైఎస్సార్ సీపీ బలోపేతానికి కృషి చేయాలని ఆయన సూచించారు. వైఎస్సార్ సీపీ రాష్ట్ర సహాయ కార్యదర్శి మేడపాటి నాగిరెడ్డి, మండల కన్వీనర్ రెంటపల్లి నాగరాజు, జిల్లా కార్యదర్శి బొంతా సాంబశివరావు, నియోజకవర్గ ఎస్టీ సెల్ అధ్యక్షుడు బాణావత్ బాలాజీ, మాజీ సర్పంచి నల్లమోతు దుర్గారావు, ఏడుకొండలు, కొండలరావు తదితరులు పాల్గొన్నారు.

జూదరులపై కేసు నమోదు

జి.కొండూరు: మండల పరిధి కొత్తూరు గ్రామ శివారులో పేకాట ఆడుతున్న ఆరుగురిని జి.కొండూరు పోలీసులు శనివారం రాత్రి అదుపులోకి తీసుకున్నారు. వీరి నుంచి ఏడు ద్విచక్ర వాహనాలు, రూ.24,930 స్వాధీనం చేసుకొని కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు. మరో నలుగురు పారిపోయినట్లు తెలిసింది.

రౌడీషీటర్లకు కౌన్సెలింగ్

తిరువూరు: గతంలో పలు నేరాలకు పాల్పడిన నిందితులు సత్ప్రవర్తనతో మెలగాలని తిరువూరు సెక్టార్–1 ఎస్ఐ సత్యనారాయణ అన్నారు. తిరువూరు పోలీసు స్టేషన్ ఆవరణలో ఆదివారం రౌడీషీటర్లు, పాత నేరస్తులకు పోలీసులు కౌన్సెలింగ్ నిర్వహించారు. పోలీసు రికార్డుల్లో కెక్కితే నేరస్తుడిగా ముద్ర పడుతుందని, సమాజం చిన్నచూపు చూస్తుందని చెప్పారు. ఇకనైనా అసాంఘిక కార్యకలాపాలకు పాల్పడకుండా తగు జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు.

ముగిసిన డీఎస్సీ పరీక్షలు

తిరువూరు: ఉపాధ్యాయ నియామకాలకు ఈ నెల 6న ప్రారంభమైన డీఎస్సీ పరీక్షలు తిరువూరు వాహినీ ఇంజినీరింగ్ కళాశాల పరీక్షా కేంద్రంలో ఆదివారంతో ముగిశాయి. ప్రతి రోజూ రెండు షిఫ్టుల్లో ఈ పరీక్షలు జరిగాయని ప్రిన్సిపాల్ రంగా నాగేంద్రబాబు తెలిపారు. ప్రతి షిఫ్టులో 250 మంది చొప్పున అభ్యర్థులు పరీక్షకు హాజరయ్యారన్నారు.

సమ్మె కరపత్రాలు ఆవిష్కరణ



కరపత్రాలు ఆవిష్కరిస్తున్న నాయకులు

ఇబ్రహీంపట్నం: అసంఘటిత కార్మికుల సమస్యల పరిష్కారం కోసం జూలై 9న చేపట్టనున్న సార్వత్రిక సమ్మెను విజయవంతం చేయాలని సీఐటీయూ నాయకులు కోరారు. ఇబ్రహీంపట్నంలో సమ్మె కరపత్రాలను ఆదివారం వారు ఆవిష్కరించారు. సీఐటీయూ జిల్లా ప్రధాన కార్యదర్శి ఎన్‌సీహెచ్ శ్రీనివాస్ మాట్లాడుతూ పెట్టుబడిదారుల కోసం కేంద్రం ప్రవేశపెట్టిన లేబర్ కోడ్స్ రద్దు చేయాలన్నారు. కార్మికులకు కనీస వేతనం రూ.26 వేలకు పెంచాలని, స్కీం వర్కర్లు, కాంట్రాక్ట్ కార్మికుల పని గంటల పెంపు విధానం రద్దు చేయాలని, స్కూల్ శానిటేషన్ వర్కర్లు, నైట్ వాచ్‌మెన్‌ల మూడు నెలల పెండింగ్ వేతనం విడుదల చేయాలని, తల్లికి వందనం పథకం అంగన్‌వాడీలు, ఆశాలు, ఔట్‌సోర్సింగ్ వర్కర్స్ పిల్లలకు అమలు చేయాలని డిమాండ్ చేశారు. మండల కార్యదర్శి ఎం.మహేష్, ఉపాధ్యక్షులు కొండలరావు, కె.రాజేశ్వరి, అనుబంధ సంఘాల నాయకులు వీరయ్య, ఉష, రజని, మంగమ్మ తదితరులు పాల్గొన్నారు.

పాఠశాలల్లో విద్యార్థుల చేరికపై ప్రత్యేక డ్రైవ్



కేతనకొండ(ఇబ్రహీంపట్నం): ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థుల చేరికపై ప్రత్యేక డ్రైవ్ ఆదివారం నిర్వహించారు. పాఠశాల విద్యా శాఖ కమిషనర్ విజయరామరాజు, సమగ్రశిక్ష ఎస్‌పీడీ బి.శ్రీనివాసరావు ఆదేశాల మేరకు ఉర్దూ ఉపాధ్యాయుడు ఇర్ఫాన్ పాషా, మూలపాడు కాంప్లెక్స్ సీఆర్పీ దొంతమాల నాగేశ్వరరావు కేతనకొండ మోడల్ కాలనీలో పర్యటించి ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థులకు అందించే సదుపాయాలపై తల్లిదండ్రులకు అవగాహన కల్పించారు. బడిమానేసి ఇళ్ల వద్ద ఉంటున్న చిన్నారులను పాఠశాలల్లో చేర్పించేలా తల్లిదండ్రులకు అవగాహన కల్పించారు. పలువురు తల్లిదండ్రులు తమ బిడ్డలను పాఠశాలల్లో చేర్పించేందుకు ముందుకు వచ్చారు.

నేడు ప్రజా సమస్యల పరిష్కార వేదిక

నూజివీడు: ప్రజా సమస్యల పరిష్కార వేదిక కార్యక్రమం పట్టణంలోని సబ్ కలెక్టర్ కార్యాలయ సమావేశ మందిరంలో సోమవారం ఉదయం 10 గంటలకు నిర్వహిస్తామని సబ్ కలెక్టర్ బచ్చు స్మరణ్‌రాజ్ తెలిపారు. ప్రజా సమస్యలపై అర్జీలు స్వీకరించి గడువులోగా పరిష్కారాన్ని చూపిస్తామన్నారు.

మృతుల కుటుంబాలకు పరామర్శ



ముసునూరు: వైఎస్సార్ సీపీ నాయకులు, కార్యకర్తల కుటుంబాలకు పార్టీ కొండంత అండగా ఉంటుందని నూజివీడు మాజీ ఎమ్మెల్యే మేకా వెంకట ప్రతాప్ అప్పారావు అన్నారు. వైఎస్సార్ సీపీ గుళ్లపూడి గ్రామ అధ్యక్షుడు మందలపు రవిప్రసాద్ తండ్రి వెంకటేశ్వరరావు, చెక్కపల్లికి చెందిన పార్టీ నేత చేపూరి శ్రీనివాసరావు తల్లి తులశమ్మ ఇటీవల అనారోగ్యంతో మృతిచెందారు. ఆదివారం రాత్రి మండల పార్టీ అధ్యక్షుడు మూల్పూరి నాగవల్లేశ్వరరావు ఆధ్వర్యంలో మేకా ప్రతాప్ అప్పారావు పార్టీ నేతలతో కలిసి గుడిపాడు, చెక్కపల్లి గ్రామాలకు చేరుకుని మృతుల కుటుంబ సభ్యులను పరామర్శించారు. ఆయన వెంట సర్పంచ్ ఆర్ శ్రీదేవి శ్రీనివాస్, గుళ్లపూడి రాముడు, కాటేపల్లి రమేష్, మందలపు రాధాకృష్ణ తదితరులు ఉన్నారు.

రోడ్డు ప్రమాదంలో ఐదుగురికి గాయాలు

ముసునూరు: రమణక్కపేట–వలసపల్లి ప్రధాన రహదారిలో చెక్కపల్లి సమీపంలో ఆదివారం వేగంగా వచ్చిన వ్యాన్ రెండు బైక్‌లను ఢీకొట్టింది. బైక్‌లపై ఉన్న నలుగురు వ్యక్తులకు, వ్యాన్‌లో ఉన్న ఒకరికి గాయాలయ్యాయి. బాధితులను 108 వాహనంలో నూజివీడు ఏరియా ఆస్పత్రికి తరలించారు. ముసునూరు పోలీసులు కేసు నమోదు చేశారు.

పొంచి ఉన్న ప్రమాదం



చాట్రాయి: నిత్యం భారీ వాహనాలతో రద్దీగా ఉండే కృష్ణారావు పాలెం ఆర్‌అండ్‌బీ మెయిన్ రోడ్డు పక్కన పడిన గుంత ప్రమాదాలకు నిలయంగా మారుతోంది. సత్తుపల్లి–విజయవాడ రహదారి కావడంతో భారీ వాహనాలు రాకపోకలు సాగిస్తుంటాయి. చిన్నపాటి గుంత కాస్త వాహనాల రాకపోకలకు కోతకు గురై పెద్దగా మారింది. గుంతలో నీరు ఉండడంతో తెలియక వాహనచోదకులు గుంతలో పడి ప్రమాదాలకు గురవుతున్నారు. రెండు రోజుల కిందట ఓ ద్విచక్ర వాహనం వేగంగా వచ్చి గుంతలో పడడంతో వాహనదారుడికి గాయాలయ్యాయి. స్థానికులు ఎర్రటి వస్త్రాన్ని ప్రమాద సూచికగా గోతిలో అమర్చడంతో వాహన చోదకులు జాగ్రత్త పడుతున్నారు. అధికారులు స్పందించి గుంతలు పూడ్చాలని స్థానికులు కోరుతున్నారు.